క్లుప్తంగా

మహిళల ఆర్థికాభ్యున్నతికి కృషి


ముగ్గళ్లలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. సీతానగరం మండలం ముగ్గళ్లలో స్వయం సహాయక సంఘాల మహిళలతో గురువారం సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలలో మహిళలకే అగ్రపీఠం వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పంపిణీ చేసిన 31.5 లక్షల నివాస స్థల పట్టాలను మహిళల పేరుతోనే అందజేశారన్నారు. సంక్షేమ పథకాల అమలులో మహిళలకే అధిక ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా రాజకీయంగా ప్రోత్సహిస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేలా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

ఏడీబీ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే


ఎస్టీ రాజాపురం వద్ద ఏడీబీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: ఏడీబీ రోడ్డును ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం పరిశీలించారు. రాజానగరం నుంచి సామర్లకోట వరకూ ఏడీబీరోడ్డు విస్తరణలో భాగంగా కాంట్రాక్టర్లు కొద్ది రోజులుగా పనులు నిలిపివేయడంతో వడిశలేరు, ఎస్టీ రాజాపురం, రామస్వామిపేట తదితర గ్రామాల వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పలు ప్రమాదాలు జరిగి, పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. ఆయా విషయాలు తెలుసుకుని ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి స్వయంగా రోడ్డును పరిశీలించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఫోన్‌లో సూచించారు. సొసైటీ అధ్యక్షుడు పోతుల బులివీర్రాజు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

దివ్యాంగులకు ట్యాబ్‌ల పంపిణీ


గోకవరంలో దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. గురువారం భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నలుగురు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నాయకులు దాసరి సతీష్ బాబు, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, ఉనుకూరి యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి


లబ్ధిదారునికి గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న దృశ్యం

పెదపూడి: అర్హులైన వారు ఉజ్వల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ కర్రి వెంకటపద్మావతి, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామం శివారు లక్ష్మీనరసాపురంలో ఉజ్వల పథకంలో ఎంపికైన 18 మందికి గ్యాస్ కనెక్షన్లను గురువారం పంపిణీ చేశారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇస్తారని వారు పేర్కొన్నారు. లబ్ధిదారుని ఆధార్‌కార్డు, తెల్ల రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా, రెండు ఫొటోలతో పూర్తిచేసిన దరఖాస్తును సచివాలయ కార్యదర్శి ద్వారా గ్యాస్ ఏజెన్సీకి అందజేయాలన్నారు. సచివాలయ కార్యదర్శి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి పాల్గొన్నారు.

ఒకటిన వర్క్‌షాప్

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో డిసెంబర్ ఒకటో తేదీన సాంఖ్యక పద్ధతులపై విశ్లేషణ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు గురువారం కళాశాలలో వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రజా సంక్షేమమే జగన్ లక్ష్యం

- ఎన్నికల హామీలను దాదాపు నూరు శాతం నెరవేర్చిన ఘనత ఆయనదే..
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో పార్టీ నాయకులు


లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు


సింగంపల్లి సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

రాజానగరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని వరాలను కూడా ప్రజలకు అందించిన ప్రభుత్వంగా జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు చరిత్రలో నిలిచిపోతుందని జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని మండలంలో లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో గురువారం ప్రారంభించారు. అమ్మ ఒడి, కాపు నేస్తం, రైతు భరోసా, చేదోడు, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి అనేక సంక్షేమ పథకాలతో అర్హులందరికీ ఆర్థిక భరోసాను కల్పించారన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలలో 99.5 శాతం వరకు నెరవేర్చారన్నారు. అదే గతంలో చంద్రబాబు 650 హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటన్నిటినీ తుంగలో తొక్కిన విషయాన్ని ప్రజలు మరువరాదన్నారు. ఈ కారణంగా ప్రజల బాగోగులు కోరుకునే జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని, అందుకు మీరంతా రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయంలో వివిధ సంక్షేమ పథకాల వివరాలు, ఆ గ్రామంలో ఏ పథకం ద్వారా ఎంత మంది ప్రయోజనం పొందారు, గ్రామాభివృద్ధికి ఏఏ కార్యక్రమాల ద్వారా నిధులు కేటాయించారు మున్నగు వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వి.శ్రీరామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి ఇన్‌చార్జి ఎ.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మెట్ల ఏసుపాదం, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, గువ్వల వెంకటేశ్వరరావు, చింతపల్లి శ్రీనివాస్, శరకనం కాశీవిశ్వేశ్వరరావు, సచివాలయ గృహసారథులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

సింగంపల్లిలో అట్టహాసంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

రంగంపేట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం సింగంపల్లి గ్రామంలో సచివాలయం వద్ద అట్టహాసంగా జరిగింది. తొలుత సంక్షేమ పథకాల బోర్డును జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్‌ను అందించారు. పథకాల లబ్ధి పొందిన వారి నుంచి వేలిముద్రలు సేకరించారు. ఆయా కుటుంబాలకు ఇంతవరకూ ఏ పథకాలందాయి, దానికి సంతృప్తి చెందారా అనే విషయాలను తెలుసుకున్నారు. వారింకా ఏ పథకానికి అర్హులో గుర్తించి, దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పార్టీ మండల వ్యవహారాల ఇన్‌చార్జి నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇబ్రాయిల్, రాష్ట్ర చేనేత, రైతు విభాగాల కార్యదర్శులు పాలాటి నాగేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పోతుల బులివీర్రాజు, సర్పంచ్ తుట్టా శివశంకర ఆనంద్, ఈఓపీఆర్డీ వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శి ఎల్.త్రిమూర్తులు, ఎంపీటీసీ ఎం.సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే సీఎం కావాలి

కుతుకులూరు 'వై ఏపీ నీడ్స్ జగన్'లో నేతలు


సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సత్తి రామకృష్ణారెడ్డి

అనపర్తి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావాలని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కుతుకులూరు గ్రామ సచివాలయం –1 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి వైఎస్సార్ సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ అధికారాన్ని చేపట్టాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు అన్ని వర్గాల ప్రజల ఆర్థిక స్థితిగతులను మార్చివేశాయన్నారు. నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం ద్వారా, రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు సీఎం కావాలనే విషయాన్ని తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సత్తి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 99 శాతం హామీలను అమలు చేయడంతో పాటు పార్టీలకతీతంగా పారదర్శక పాలన సాగిస్తున్న ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ చేసిన మోసాలను, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని ప్రజలు గుర్తెరగాలన్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, ఎంపీటీసీ సత్తి దొరయ్యారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పీహెచ్‌సీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి, పార్టీ రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ నాయకుడు సత్తి వెంకటరెడ్డి, ఈఓపీఆర్డీ కేయూఆర్‌ఎల్ పద్మజ, నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి ఉయ్యూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


పైన గ్రామంలో ప్రదర్శన బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, ఇతర నేతలు

ప్రభుత్వం చేసిన మంచిని వివరించడానికే..

పెదపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించడానికే వై ఏపీ నీడ్స్ జగన్ ప్రత్యేక కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. పైన గ్రామంలో గురువారం ఈ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది.

సచివాలయం వద్ద పథకాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించి, ప్రజలకు అవగాహన సభ నిర్వహించారు. ఎంపీపీ తులసి మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారని, అందుకే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలన్నారు. జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపీడీఓ వీవీ సాయిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ సుందరపల్లి ప్రమీల, ఎంపీటీసీ సుందరపల్లి సుధాకర్‌బాబు, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, గ్రామ కన్వీనర్ పంపన నాగరాజు, మాజీ సర్పంచ్ కట్టా వెంకటరమణ పాల్గొన్నారు.

బిక్కవోలులో..


బిక్కవోలులో బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శేషుకుమారి

బిక్కవోలు: ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని బిక్కవోలు సచివాలయం–3లో నిర్వహించారు. ఎంపీపీ జ్యోతిర్మయి శేషుకుమారి సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ డీబీటీ, నాన్ డీబీటీ ఇతర అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సుమారు 4,112 మందికి రూ.22,89,80,702 అందించినట్టు వివరించారు. ఎటువంటి మధ్యవర్తులు, దళారీలు లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించినట్టు చెప్పారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. జెడ్పీటీసీ రొంగల పద్మావతి, సర్పంచ్ సరెళ్ల సుమలత, ఉప సర్పంచ్ జంగా మురళీకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, పార్టీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, నాయకులు కొవ్వూరి సత్తిబాబు, రొంగల అప్పాజీ, బొడ్డు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటుహక్కు పొందాలి


రాజానగరంలో ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ తేజ్ భరత్, ఆర్డీవో చైత్రవర్షిణి తదితరులు

రాజానగరం: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పొందాలని, సమర్థులైన పాలకులను ఎన్నుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంపై ప్రజలను చైతన్యపరుస్తూ తహసీల్దార్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో రాజానగరంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్డీఓ చైత్రవర్షిణి ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ ఈ కార్యక్రమం సాగింది. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ర్యాలీలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేశారు. తొలుత మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసే అంశంపై మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయ కుమారి, రాజానగరం ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి, డీటీ సునీత పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి


అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న వీరాంజనేయులు

గోకవరం: అమరవీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్ సంస్థలు, భూస్వామ్య వర్గాల దోపిడీ నుంచి విముక్తి కోసం పోరాడి అమరులైన విప్లవకారుల ఆశయాల మార్గమే దేశ విముక్తికి మార్గమన్నారు. యువత ప్రజావ్యతిరేక విధానాలపై అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తొలుత స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కొండా దుర్గారావు, జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.అంజిబాబు, స్త్రీవిముక్తి జిల్లా కన్వీనర్ మంగ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


రంగంపేట పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వేణుశ్రీలక్ష్మి

రంగంపేట: మాతృత్వ వందన యోజనను గర్భిణులందరూ సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మి కోరారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఈ యోజనలో భాగంగా 36 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు రక్త పరీక్షలు, స్కానింగ్ నిర్వహించి, ఉచితంగా మందులు అందించామని ఆమె చెప్పారు. హైరిస్క్ గర్భిణులను రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు రిఫర్ చేశామన్నారు. వీరిని 108 లేదా 102 తల్లీబిడ్డల వాహనాల్లో తరలిస్తారని చెప్పారు. గర్భిణులకు పౌష్టికాహారం, ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై వివరించారు. సీహెచ్‌ఓ కె.జయమణి పాల్గొన్నారు.

సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలి

పెదపూడి: గర్భిణులు తప్పనిసరిగా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని పెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.సురేఖ అన్నారు. పెద్దాడలోని పీహెచ్‌సీలో పీఎం సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా గురువారం సుమారు 36 మంది గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. హైరిస్క్ గర్భిణులకు జాగ్రత్తలు చెప్పారు. కొందరికి స్కానింగ్ చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతినెలా 9న ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారని డాక్టర్ సురేఖ తెలిపారు. గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యురాలు ప్రత్యూష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో రంగంపేట విద్యార్థుల ప్రతిభ


ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థినులు

రంగంపేట: రాజమహేంద్రవరం ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో ఈ నెల 8న నిర్వహించిన 31వ జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్‌లో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల హెచ్‌ఎం వి.పార్థసారథి తెలిపారు.

గురువారం ఆయన మాట్లాడుతూ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వి.రమ్యసుధ మార్గదర్శకంలో ఎం.ఆషిక, టి.ప్రసన్న ప్రదర్శించిన ఎకో ఫ్రెండ్లీ శానిటరీ నాప్కిన్స్ (అరటి దొప్ప)లతో తయారు చేసిన అంశానికి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పుణ్యక్షేత్రంలో గడప గడపకూ..


పుణ్యక్షేత్రంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని పుణ్యక్షేత్రంలో గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి, ప్రజల యోగక్షేమాలను తెలుసుకున్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల సభ్యులు ప్రజలను ఏవిధంగా పీడించేవారో గుర్తు చేస్తూ, అటువంటి వారిని ఎప్పటికీ దూరంగానే ఉంచాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను తెలియజేశారు.

అభివృద్ధి పనులకు రూ.8.28 కోట్లు

గడచిన నాలుగున్నరేళ్లలో పుణ్యక్షేత్రంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.8.28 కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారందరికీ రూ. 9.73 కోట్లు అందజేశామన్నారు. ప్రజారంజక పాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, సర్పంచ్‌లు మరుకుర్తి వెంకటేశ్వర్రావు, పెంటగట్ల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు పలివెల వెంకట్రావు, నాయకులు గండి నానిబాబు, గంగిశెట్టి సోమేశ్వరరావు, శ్రీధర్, పేపకాయల రాంబాబు, ఈశ్వర్రావు, వేమగిరి కృష్ణ, పోతురాజు, వీరబాబు పాల్గొన్నారు.

దివాన్ చెరువులో వైద్యశిబిరం

రాజానగరం: ప్రజా సంక్షేమంతో పాటు ప్రజారోగ్యం కూడా ముఖ్యమనే భావంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బెనిడిక్ట్ అన్నారు. దివాన్ చెరువులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 3,867 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 936 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం, డాక్టర్ శ్రీవాణి, సీహెచ్‌ఓ మేరీహెబ్సి, హెచ్‌ఎస్ ఎంయూకే సుబ్రహ్మణ్యేశ్వరరావు, టీబీ సూపర్ వైజర్ శేషు పాల్గొన్నారు.

రేపు విశ్వరూప మహాసభ

మధురపూడి: మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ శనివారం సికింద్రాబాద్‌లోని పేరేడ్ గ్రౌండ్‌లో జరుగుతుందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గెద్దం వినోద్, జిల్లా కో కన్వీనర్ బంటుపల్లి ఏసు తెలిపారు. ఈ మేరకు గురువారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో బిల్లు చేయాలన్న డిమాండ్‌తో జరుగుతున్న సభకు వేలాదిగా తరలిరావాలని కోరారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సభకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

ఓటు నమోదుకు 9 వరకూ అవకాశం

రాజానగరం: ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో ఓటు నమోదుకు డిసెంబరు 9 వరకూ అవకాశం ఉందని రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణి తెలిపారు. ఓటరు నమోదు కార్యక్రమంపై ప్రజలను చైతన్యపరుస్తూ గురువారం రాజానగరంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2024 జనవరి ఒకటి లేదా ఏప్రిల్ ఒకటి నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు హక్కు పొందవచ్చన్నారు. ఇందుకుగాను ఫారమ్ 6లో తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. అలాగే మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు తొలగింపునకు ఆయా కుటుంబ సభ్యుల అనుమతితో ఫారమ్ 7, సవరణలు, పోలింగ్ బూత్‌ల మార్పు, దివ్యాంగ ఓటరు గుర్తింపునకు ఫారమ్ 8లో దరఖాస్తు చేసుకోవచ్చు. వీటిని నేరుగా తహసీల్దార్ కార్యాలయంలోగానీ, ఎంపీడీఓ కార్యాలయంలోగానీ అందజేయవచ్చన్నారు. మీ సేవ కేంద్రం, వెబ్‌సైట్, పోర్టల్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మధురపూడి: గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు కోరుకొండ గ్రంథాలయాధికారి వీవీ శ్రీనివాస్ తెలిపారు. అలాగే 14న మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవం జరుగుతోందన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు.

బాలలకు ఆటల పోటీలు

రాజానగరం: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ కార్యాలయం వద్ద గురువారం బాలలకు ఆటల పోటీలు నిర్వహించారు. రన్నింగ్ రేస్, వాటర్ బాల్స్, ఫ్రాగ్ జంప్, మ్యూజికల్ చైర్, రింగ్ గేమ్, వంటి పోటీలలో 60 మంది పాల్గొన్నారు. విజేతలకు బాలల దినోత్సవం రోజు బహుమతులు అందజేస్తామని నిర్వాహకుడు, ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంటేశ్వర్రావు తెలిపారు.

విద్యార్థుల పాత్ర కీలకం

మధురపూడి: సమాజంలో జరిగే ప్రతి మార్పులోనూ విద్యార్థుల పాత్ర కీలకమని పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ కుమార్ అన్నారు. కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో జరిగిన ప్రతి ఉద్యమంలో విద్యార్థుల పాత్ర ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి కె.భాను, నాయకులు దినేష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలి

అనపర్తి: ప్రభుత్వాస్పత్రుల వైద్యులు, సిబ్బంది ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం.సనత్‌కుమారి ఆదేశించారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్‌ఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వార్డులు, వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు నిరంతర వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో అధిక కాన్పులు జరిగేలా చూడాలని చెప్పారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగురురెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎల్ఐసీ బాల, బి.ఉమాశంకర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.